కరెంటు కట్

- భీంపూర్‌లో సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే విద్యుత్ బంద్
- కరెంటు లేదని ఎంపీటీసీల ఫిర్యాదు
- 24 గంటలు అంధకారంలో రాజుల వాడి
- ఫారెస్టు అధికారులపై జడ్పీటీసీ ఫైర్

విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్న కరంజి ఎంపీటీసీ రెడ్డివార్ దేవమ్మ

తాంసి(భీంపూర్), జూలై 3 : భీంపూర్‌లోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో విద్యుత్ సమస్యలు రోజురోజుకి పెరుగుతున్నాయని అర్లి, కరంజి, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. చిన్న గాలివాన వస్తే రాజులవాడి గ్రామంలో 24 గంటలు గడిచిన కరెంట్ రాలేదని వాపోయారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని సభదృష్టికి తీసుకొచ్చారు. అదే సమయంలో కొద్ది సేపు కరెంట్ కట్ కావడంతో ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంట్ కట్ అవ్వడం మామూలేనని జడ్పీటీసీ, ఎంపీపీలు విమర్శించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పలు శాఖల అధికారులు నివేదికలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరావు, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, మండల ప్రత్యేకాధికారి కిషన్, మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, ఎంపీటీసీలు కరంజి రెడ్డి, దేవమ్మ రమేశ్, మడూర్ భోజన్న యాదవ్, నిపాని చల్లంగమ్మ, మడావి అన్నపూర్ణ, నాయకులు సంజీవ్‌రెడ్డి, అనిల్, నరేందర్, గంగయ్య, జహూర్ అహ్మద్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధించాం



బోథ్: ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

బోథ్, జూలై 3 : ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో మండలంలో అభివృద్ధి సాధించామని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ, ఏకేపీ, విద్య, మహిళా శిశు సంక్షేమం, గ్రామ పంచాయతీ, విద్య, తదితర శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్, అటవీ, పంచాయతీరాజ్, శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. పదవి కాలం ముగిసినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తామన్నారు. చివరి సమావేశానికి అధికారులు రాకపోవడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సమస్యలు ఎప్పటికప్పుడు తీసుకెళుతూ, పరిష్కరించకపోతే నిలదీస్తామన్నారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తాహెర్‌బిన్‌సలాం, ఉపాధ్యక్షుడు లింబాజీ, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్, ఎంపీడీవో రమేశ్, ఎంపీటీసీలు, సీడీపీవో సౌందర్య, ఎంఈవో భూమారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా, నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 3 : పంటల బీమా, నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ రకాల ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల లభ్యత తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి పంట బీమా, నమోదును నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన అమ్మిన సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలి

దస్తురాబాద్, జూలై 3 : అధికారులు ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారించడానికి కృషి చేయాలని ఎంపీపీ సింగరి కిషన్ కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సింగరి కిషన్ అధ్యక్షతన బుధవారం చివరి మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఐదు సంవత్సరాల పదవీ కాలంలో సహకరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎంపీపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సంతపూరి శారద, వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, ఎంపీటీసీలు, తహసీల్దార్ సర్పరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అనిల్ కుమార్, డీటీ యాదవ రావు, సూపరింటెండెంట్ గోపాల్ కిషన్, డాక్టర్ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సహకారంతో అభివృద్ధి



సోన్: ఎంపీపీని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

సోన్, జూలై 3: ప్రతి ఒక్కరి సహకారంతో అభివృద్ధి చేశామని నిర్మల్ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపీపీ, ఎంపీటీసీల వీడ్కోలు సభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 2019–24 వరకు మండలంలోని అన్ని గ్రామాలను 99.99 శాతంతో నాయకులు, అధికారుల సహకారంతో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు.

ఏడాది వేతనం రూ. 1.50లక్షలు సహాయం...

ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి గతేడాది కాలం వేతనం రూ. 1.50లక్షలను మండలంలోని 20 గ్రామ పంచాయతీలోని పని చేస్తున్న కార్మికులకు సహాయంగా అందించారు. ప్రతి గ్రామంలో వీళ్ల పని చేస్తేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. అనంతరం శాలువాతో సన్మానించి నగదును అందజేశారు. కార్యక్రమంలో ముఠాపూర్ పీఏసీఎస్ చైర్మన్ బొండ్ల గంగాధర్, ఎంపీడీవో గజానాన్, ఎంపీవో సునీత, ఏపీవో తుల రామకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి వసంత్‌రావు, విద్యుత్ శాఖ ఏఈ కిశోర్‌కుమార్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో క్రానియోటమీ శస్త్ర చికిత్స

వివరాలను వెల్లడిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఎదులాపురం, జూలై 3 : రిమ్స్‌లో మొట్ట మొదటి సారిగా క్రానియోటమీ శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారని డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ వివరించారు. ఆదిలాబాద్‌కు చెందిన రోహన్(25) ఇటీవల బైక్‌పై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయాలయాయి. రిమ్స్‌లో అతను చేరగా వైద్యపరీక్షలు చేయగా మెదడులో రక్తం గడ్డ కట్టుకపోయి తల ఎముకలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. న్యూరో సర్జరీలో అరుదైన శస్త్ర చికిత్స (క్రానియోటమి సర్జరీ)ని న్యూరోసర్జన్ డాక్టర్ ఎం విజయ్ మోహన్, అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ దుర్గా గణేశ్, వరుణ్, అనస్థిషియాలజిస్ట్ డాక్టర్ సతీశ్, ఎండీ, టీమ్ బృంద సభ్యులు విజయవంతం చేశారాన్నారు. రోహన్‌ను పది రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచి డిశ్చార్జి చేస్తామని న్యూరో సర్జన్ డాక్టర్ ఎం విజయ్ మోహన్ తెలిపారు. వైద్యులను రిమ్స్ డైరెక్టర్ అభినందించారు. సమావేశంలో రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఇద్రీస్‌అక్బనీ, వైద్యబృందం పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

ఎదులాపురం, జూలై 3 : ఆదిలాబాద్‌లోని ఇందిరమ్మకాలనీలో బుధవారం ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో కత్తిపోట్లకు దారి తీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఇందిరమ్మకాలనీలో కటింగ్ షాపు వద్ద వీర్ రాహుల్, ఇమ్రాన్‌ఖాన్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఇమ్రాన్‌ఖాన్ జేబులో ఉన్న కత్తిని తీసి వీర్ రాహుల్‌పై దాడి చేశాడు. రాహుల్‌కు మెడ, భుజంపై తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. ఇమ్రాన్‌ఖాన్ అక్కడి నుంచి పారిపోయాడు. రాహుల్‌ను స్థానికులు రిమ్స్ దవాఖానకు తరలించారు. రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇమ్రాన్‌ఖాన్‌పై రూరల్ ఎస్ఐ ముజాహిద్ కేసు నమోదు చేశారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని

నిర్మల్ అర్బన్, జూలై 3 : ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాల్ మెంట్ ఇంజినీర్లతో ప్లాస్టిక్ నిషేధం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వాడకుండా వినియోగాదారులకు విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. మున్సిపల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేయాలని సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు.

విద్యార్థులకు సరైన పోషకాహారం అందించాలి

నర్సాపూర్(జీ), జూలై 3: తురాటి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందాల్సిన పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ద్విచక్ర వాహనంపై వెళ్లి సెగ్రిగేషన్ షెడ్డు, శ్మశాన వాటికను పరిశీలించారు. వీటి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో పుష్పలత ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి, సూపరింటెండెంట్

ఎదులాపురం, జూలై 3 : భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధత్య అందరిపై ఉందని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత, సూపరింటెండెంట్ డాక్టర్ ఇద్రీస్ అక్బనీతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయ్‌మోహన్, దుర్గ గణేశ్, సతీశ్, దేవీదాస్, సీడీపీవో వనజ, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఖానాపూర్ రూరల్, జూలై 3: కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విజేత పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలోని విజేత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రొటోకాల్ పాటించాం

మాట్లాడుతున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్, జూలై 3: బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ప్రతిపక్షాలకు ప్రొటోకాల్ పాటించి మర్యాదలు అందించామని ఉట్నూర్ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ప్రొటోకాల్ పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రొటోకాల్ వివాదంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆదివాసీలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఓడిపోయిన ఆత్రం సుగుణను అధికారిక కార్యక్రమాల్లో ఎలా ఆహ్వానిస్తారని ఆరోపించారు. కోవ లక్ష్మి దిష్టిబొమ్మ దహనం చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ పథకాల అమలుకు ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు సీతారాం, సిడాం సోనేరావ్, ఆత్రం తిరుపతి, మాణిక్‌రావ్, ఆనంద్‌రావ్, మహేందర్, దేవ్ పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

ఉట్నూర్, జూలై 3: ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్‌ను బుధవారం న్యాయవాది కొమ్ము విజయ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఎదులాపురం, జూలై 3 : కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో బుధవారం జైనథ్, భోరజ్, ధరోడ, నిరాల గ్రామాల్లో పత్తి, సోయాబిన్ పంటల్లో క్షేత్రస్థాయి పర్యటను శాస్త్రవేత్తలు పర్యటించారు. ప్రస్తుతం పత్తి పంట 2 నుంచి 4 ఆకుల దశలో ఉందన్నారు. పత్తిలో మిల్లిపెడ్స్ నివారణకు రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. ఈ పర్యటనలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.



జీడీపీలో ప్రభుత్వ అప్పులు 82 శాతం

ఎన్‌సీపీఈఆర్ డీజీ పూనమ్ గుప్తా వెల్లడి

ఇది రుణ భారతం

న్యూఢిల్లీ, జూలై 3: భారత్.. అధిక రుణ భారాన్ని ఎదుర్కొంటున్నదని ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తా అన్నారు. దేశ జీడీపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు దాదాపు 82 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే చాలావరకు రుణాలు స్థానిక కరెన్సీ అయిన రూపాయల్లోనే ఉండటం, దేశ వృద్ధి రేటు కూడా ఆకర్షణీయంగా ఉన్న కారణంగా ఇప్పటికైతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్‌సీఏఈఆర్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో గుప్తా మాట్లాడుతూ.. మొత్తం అప్పుల్లో మూడింటా ఒక వంతు రాష్ట్రాలవని చెప్పారు. రాబోయే ఐదేండ్లలో రుణ భారం మరింతగా పెరిగేందుకు వీలుందన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ హామీ ఉండటం వల్ల రాష్ట్రాలపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చన్నారు.

ఎన్నికల హామీలతో..

సాధ్యం కాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తున్న వివిధ పార్టీల వల్లే రాష్ర్టాల అప్పులు ఇంతలా పెరుగుతూపోతున్నాయని తక్షశిల ఇన్‌స్టిట్యూషన్ కౌన్సిలర్ ఎం గోవింద రావు ఈ సందర్భంగా అభిప్రాయపడటం గమనార్హం. గత ఏడాది ఆఖర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ సైతం పెద్ద ఎత్తున సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, రుణ మాఫీ హామీలతోనే అధికారంలోకి వచ్చినది తెలిసిందే. ముందుగా చెప్పినట్టుగా ఈ హామీల అమలుకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుండగా.. తీవ్రంగా వేధిస్తున్న నిధుల కొరతనూ చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏఈఆర్ చర్చలో పాల్గొన్న గోవింద రావు వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇదిలావుంటే 2022–23 నాటికి పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బీహార్ రాష్ర్టాల అప్పులే మిగతా రాష్ర్టాలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అయితే మున్ముందు ఈ జాబితాలో దక్షిణాది రాష్ర్టాల పేర్లూ ఉంటాయన్న అంచనాలు వస్తుండటం గమనార్హం.

10 లక్షల కోట్లకు దేశీయ ఆహార మార్కెట్

2030 నాటికి చేరుతుందని అంచనాలు



న్యూఢిల్లీ, జూలై 3: దేశీయ ఆహార సేవల పరిశ్రమ అంచనాలకుమించి రాణిస్తున్నది. 2030 నాటికి ఈ రంగం రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని బెయిన్ అండ్ కంపెనీ, స్విగ్గీ సంయుక్తంగా 'హౌ ఇండియా ఈట్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే కస్టమర్లు 45 కోట్లకు చేరుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నది. వచ్చే ఏడేండ్లలో ప్రతియేటా 10–12 శాతం మధ్యలో వృద్ధిని నమోదు చేసుకుంటుందన్న సర్వే.. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని వెల్లడించింది.

- ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగం ప్రతియేటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నది.
- 2023లో 12 శాతంగా ఉన్న వినిమయం 2030 నాటికి 30 శాతానికి చేరుకుంటుందన్న అంచనా.
- భారత్‌లో కంటే చైనాలో నాలుగు రెట్లు అధికంగా రెస్టారెంట్లు ఉన్నాయి.
- ప్రస్తుతం 32–34 కోట్లుగా ఉన్న ఆహార సేవల మార్కెట్ కస్టమర్లు..వచ్చే ఆరేండ్లలో మరో 11 కోట్లు పెరిగి 43 నుంచి 45 కోట్లకు పెరగనున్నారు.
- దేశవ్యాప్తంగా 50 నగరాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సర్వేను రూపొందించింది.

ఇక పెద్దగా లాభాలుండవ్

దేశీయ స్టాక్ మార్కెట్లపై ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఫ్ అంచనా

రాబోయే మూడేండ్లూ అంతంతమాత్రంగానే సూచీల కదలికలు

ముంబై, జూలై 3: రాబోయే మూడు సంవత్సరాలు మదుపరులకు ఈక్విటీ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాబడులను అందించకపోవచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆర్ జానకిరామన్ అంచనా వేస్తున్నారు. గడిచిన మూడేండ్ల మాదిరిగా దేశీయ స్టాక్ మార్కెట్లు తదుపరి మూడేండ్లు పరుగులు పెట్టకపోవచ్చని బుధవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. కానీ ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ మెరుగ్గానే ఉంటాయన్నారు. అయితే అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ ఆల్‌టైమ్ హైని తాకిన నేపథ్యంలో జానకిరామన్ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

లాభాల స్వీకరణ దిశగా..

ప్రస్తుతం మార్కెట్ వాల్యుయేషన్స్ అధికంగా ఉన్నాయన్న జానకిరామన్.. నిజానికి గత కొన్నేండ్లుగా ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాలను మించి వాటి షేర్లు ట్రేడ్ అవుతున్నాయని చెప్పారు. అయితే ఇకపై మదుపరులు తమ పెట్టుబడులను తిరిగి తీసుకునే దిశగా అడుగులు వేయబోతున్నారన్నారు. సూచీలు జీవనకాల గరిష్ఠాల్లో ఉన్న వేళ లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు పెద్దపీట వేస్తారని చెప్పున్నారు. కాగా, స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున వస్తున్న ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో)పైనా స్పందించారు. కొత్తగా లిస్టింగ్ అవుతున్న సంస్థలు అందివచ్చిన సొమ్మును తెలివిగా వాడుకోవాలని సూచించారు. ఇదిలావుంటే ఓ మల్టీక్యాప్ కొత్త ఫండ్‌ను ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఆఫర్ చేస్తున్నది. ఈ నెల 8న మొదలై.. 22న ముగుస్తుంది. ఒక్కో యూనిట్ రూ.10కి లభిస్తుంది.

రూ.445.43 లక్షల కోట్లకు..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో బుధవారం రూ.445.43 లక్షల కోట్లకు చేరింది. భారీ లాభాల నడుమ మదుపరుల సంపద రూ.4,45,43,642.29 కోట్లు (5.33 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ 0.86 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా బ్యాంకింగ్ షేర్లు 1.75 శాతం లాభపడ్డాయి. ఆర్థిక సేవలు, టెలీకమ్యూనికేషన్స్, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, ఎఫ్‌ఎంసీజీ సూచీలు 1.55 శాతం నుంచి 0.81 శాతం వరకు పుంజుకున్నాయి. అదానీ పోర్ట్స్ షేర్ విలువ అత్యధికంగా 2.49 శాతం పెరిగింది. కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్ షేర్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి.

తొలిసారి 80వేలకు సెన్సెక్స్

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మరో చారిత్రక స్థాయిని తాకింది. తొలిసారి 80,000 మార్కుపైకి వెళ్లింది. గరిష్ఠంగా 80,074.30 వద్దకు చేరింది. అయితే మదుపరుల అమ్మకాల ఒత్తిడితో రికార్డు స్థాయిని నిలుపుకోలేకపోయింది. అయినప్పటికీ 545.35 పాయింట్లు లేదా 0.69 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 79,986.80 వద్ద స్థిరపడింది. కాగా, కేవలం 3 నెలల్లోనే సూచీ ఏకంగా 5వేల పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 162.65 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగిసి మొదటిసారి 24,286.50 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 24,307.25 వద్దకు వెళ్లి ఇంట్రా–డే హైని నెలకొల్పింది.

సెన్సెక్స్ హైలైట్స్

తేదీ	పాయింట్లు
07-02-2006	10,000
11-12-2007	20,000
26-04-2017	30,000
03-06-2019	40,000
03-02-2021	50,000
24-09-2021	60,000
11-12-2023	70,000
03-07-2024	**80,000**



స్టార్ హెల్త్ 'హోమ్ హెల్త్‌కేర్' సేవలు

చెన్నై, జూలై 3: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ.. ఇంటివద్దనే హెల్త్‌కేర్ సేవలు ప్రారంభించింది. కస్టమర్లకు ఇంటి వద్దనే ఆరోగ్యానికి సంబంధించిన సేవలు అందించాలనే ఉద్దేశంతో కేర్24, పోర్టీ, కాల్ హెల్త్, అతుల్యా హోమ్‌కేర్, అర్గాల వంటి సంస్థలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఇంటి వద్దనే జ్వరం, గ్యాస్ట్రో సమస్యలు, మూత్ర నాళల్లో ఇన్ఫెక్షన్ వంటి రోగులకు చికిత్స అందించనున్నారు. ఈ సేవలకోసం టోల్–ఫ్రీ నంబర్ 044–69006900 లేదా స్టార్ హెల్త్ మొబైల్ యాప్‌ను సంప్రదించాలని సూచించింది. ఇలా సంప్రదించిన వారికి వీలైనంత త్వరగా డాక్టర్ వారి దగ్గరికి వచ్చి చికిత్స చేయనున్నారు. ఐదు రోజులపాటు చికిత్స కోసం డాక్టర్ ఫీజుతోపాటు నర్స్‌కు అయ్యే రూ.7000–7,500 ఖర్చు ను సమ్ అస్యూర్డ్ కింద కట్ చేసుకోనున్నారు.

కూత కూయదిక

ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని విలవిల • నాలుగేండ్లకే మూతపడ్డ దేశీయ స్టార్టప్

న్యూఢిల్లీ, జూలై 3: దేశీయ సోషల్ మీడియా యాప్ 'కూ' మూతపడింది. ఎక్స్(గతంలో ట్విట్టర్)కు ప్రత్యామ్నాయంగా మారుతున్నదని నరేంద్ర మోదీ సర్కార్ ఊదరగొట్టిన ఈ స్టార్టప్ ప్రస్తుతం ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని విలవిలలాడుతున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందకపోవడం వల్లనే ఈ స్టార్టప్ తన సేవలను మధ్యలోనే నిలిపివేసింది. కేంద్ర మంత్రులే స్వయంగా ఆత్మనిర్భర్ యాప్‌గా ప్రమోట్ చేసిన ఈ సంస్థ కేవలం నాలుగేండ్లలోనే కాలగర్భంలో కలిసిపోయింది. అంతర్జాతీయ స్థాయి స్టార్టప్‌లను ఎదుర్కొవాలంటే వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరం..కానీ మోదీ సర్కార్ కేవలం ప్రమోట్ మాత్రమే చేసిందని, ఆర్థికంగా ఆదుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

పెట్టుబడులకు గ్లోబల్ సంస్థలు వెనుకంజ

నిధుల కొరత తమకు అవరోధంగా మారిందని, దేశీయ యాప్‌ను నిలబెట్టేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో తన కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకులు అప్రమేయ రాధాకృష్ణ, మయాంక్ బిదావాత్కా లింక్డిన్‌లో పోస్ట్‌చేశారు. ఇక నుంచి చిన్న యెల్లో బర్డ్ కనిపించదని పేర్కొన్నారు. గతేడాదిగా ఆర్థిక కష్టాలు చుట్టుముట్టినప్పటికీ నడిపించామని, అంతర్జాతీయ సంస్థలైన డైలీ హంట్ సహా వివిధ కంపెనీలతో విక్రయానికి చర్చలు జరిపినా అవేవీ సఫలీకృతం కాకపోవడంతో చివరికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరువురు ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికన్లు డామినేట్ చేస్తున్నారని, భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుందని ఆశించినప్పటికీ ఫలితాలు వేరే విధంగా ఉన్నాయన్నారు. స్థానిక భాషలకు పెద్ద పీట వేస్తూ దేశీయ యాప్‌ను రూపొందించామని, ఓ దశలో 21 లక్షల రోజువారీ యాక్టివ్ యూజర్లను సంస్థ సొంతం చేసుకున్న విషయాన్ని ఇరువురు గుర్తుచేసుకున్నారు. రైతు ఉద్యమ సమయంలో అకౌంట్ల బ్లాకింగ్ విషయంలో ట్విట్టర్‌తో కేంద్రానికి ఘర్షణ నెలకొన్నప్పుడు ఈ యాప్‌కు దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరింది. దీంతో భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగించింది కూడా.



- ఒక దశలో రోజువారి యాక్టివ్ కస్టమర్లు 21 లక్షల మంది.. నెలవారీగా కోటి మందికి తగ్గకుండా ఉన్నారు.
- సంస్థలో టైగర్ గ్లోబల్, ఏసల్, 3వన్4 క్యాపిటల్, కలారి క్యాపిటల్‌లు పెట్టుబడులు పెట్టాయి.
- హిందీ, తెలుగు, తమిళం, బెంగాలీ, గుజరాతీ, మరాఠి భాషల్లో సేవలు అందించింది.

వాణిజ్యం

కియా సెల్టోస్ ప్రియం

న్యూఢిల్లీ, జూలై 3: దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన సెల్టోస్ ధరను పెంచుతున్నట్లు కియా ప్రకటించింది. ఈ నెల నుంచే అమలులోకి వచ్చేలా సెల్టోస్ కార్ ధరను రూ.2 వేల నుంచి రూ.19 వేల వరకు పెంచుతున్నట్లు తెలిపింది. దీంతో ఈ కారు రూ.10.90 లక్షల నుంచి రూ.20.37 లక్షలలోపు లభించనున్నది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ 230 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జూలై 3: గ్లాస్ ఉత్పత్తుల సంస్థ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్, భువనగిరి, ఇస్నాపూర్ ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి, నూతన టెక్నాలజీని అందుబాటులోకి తేవడానికి రూ.230 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు కంపెనీ సీఈవో రాజేశ్ ఖోస్లా తెలిపారు. అలాగే మధ్యతూర్పు, యూరప్ దేశాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భాగంగా ఎగుమతులను పెంచుకుంటున్నట్లు ప్రకటించారు. ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చిన భువనగిరి ప్లాంట్‌లో ప్రస్తుతం రోజుకు 154 టన్నుల గ్లాస్ ఉత్పత్తి అవుతున్నదని, నూతన టెక్నాలజీ కోసం ఆర్‌అండ్ డీ సెంటర్‌ను కూడా మరింత బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించారు. 160 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌తో 2,400 మందికి ఉపాధి లభిస్తున్నాయి.

వోల్వో ఈవీ కారు!

న్యూఢిల్లీ, జూలై 3: స్వీడన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం వోల్వో.. దేశీయ మార్కెట్‌పై మరింత పట్టు సాధించడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఈవీలను మాత్రమే విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇక నుంచి ప్రతీయేటా ఒక్కో ఈవీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్ మార్టిన్ తెలిపారు. ఇక నుంచి పెట్రోల్, డీజిల్ వాహనాల విక్రయాలను నిలిపివేసే యోచనలో సంస్థ ఉన్నట్లు తెలుస్తున్నది.